క్లుప్తంగా

20 లీటర్ల సారా స్వాధీనం

గూడూరు: మండలంలోని పోసినవారిపాలెం లో మచిలీపట్నం ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీలలో 20 లీటర్ల సారా, 200 లీటర్ల పులిసిన బెల్లం ఊట గుర్తించారు. మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో సారా కలిగి ఉన్న గంజాల ప్రవీణ్ అనే వ్యక్తి పట్టుబడగా, అతనిపై కేసు నమోదు చేసినట్లు వెంకటేశ్వరమ్మ తెలిపారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రామశేషయ్య, ఎస్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానం అభివృద్ధికి కృషి

పెడన: పట్టణంలో హిందూ శ్మశానం అభివృద్ధికి నిధులు సమకూర్చడానికి కృషి చేస్తానని ఎంపీ బాలశౌరి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో హిందూ శ్మశానవాటిక పరిరక్షణ, అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ బాలశౌరి ప్రసంగించారు. పట్టణంలో 13 ఎకరాలకుపైగా హిందూ శ్మశానవాటిక ఉందని, దీనిని బాగు చేయించడానికి సుమారు రూ.5.50 కోట్లు అవసరమని అంచనాలు వేశారని, ఈ నిధుల విషయంలో రాష్ట్ర పరిస్థితి అంత బాగోలేదని ఎంపీ అన్నారు. అవసరమైతే ఇతర నిధులు రప్పించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బలిపర్రు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

కొడాలి(ఘంటసాల): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాన్షీరాం సేవలు నేటి యువతకు ఆదర్శనీయమని బీఎస్పీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటూరు నాగేశ్వరరావు అన్నారు. కొడాలి గ్రామంలో బీఎస్పీ కార్యాలయంలో కాన్షీరాం జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి బీఎస్పీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ కన్వీనర్ మద్దాల బాలయ్య, అధ్యక్షుడు వంగలపాటి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు సిద్దెల పోతురాజు, చుట్టూరి వెంకటేశ్వరరావు, కాండ్రు దీనమ్మ, చుట్టూరి చంద్రలీల, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

నంగేగడ్డ(నాగాయలంక): రంగా అభిమానుల ఆధ్వర్యంలో కాపు ఉద్యమనేత, దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని శనివారం రాత్రి బందరు ఎంపీ వి.బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో చెరువు ఒడ్డున విగ్రహం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తనయుడు మండలి రాజా, పి.సి చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, కోసూరు పవన్ నాయుడు, సనకా యుగంధర్, నంగేగడ్డ గ్రామ రంగా అభిమానులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

మోపిదేవి: ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధించాలని ఈవోపీఆర్డీ కె.త్రిపురసుందరి అన్నారు. మోపిదేవిలో శనివారం షాపుల వెంట తిరిగి ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల ఉత్పత్తులను అందుబాటులో ఉంచే మార్గాలను వివరించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానం చాటుకున్న గ్రామస్తులు

కృత్తివెన్ను: దశాబ్దాల నాటి వంతెన కలనెరవేర్చడంలో ఎంతో కృషి చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ కృష్ణా రీజియన్ మాజీ చైర్మన్ పిన్నెంటి మహేష్‌ను గ్రామస్తులు సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యండపల్లి వద్ద ప్రధాన పంటకాలువపై రూ.75 లక్షలతో నూతనంగా వంతెన నిర్మాణం జరిగింది. దీన్ని శనివారం ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ వంతెన కోసం అప్పట్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అనుమతులు, నిధులు మంజూరుకు ఎంపీ ద్వారా మహేష్ ఎంతో కృషి చేశాడని సర్పంచ్ ప్రభుప్రసాద్ అన్నారు. దీనికి కృతజ్ఞతగా పార్టీల కతీతంగా యండపల్లి, గాంధీనగరం గ్రామాలకు చెందిన పలువురు ఆయనను సత్కరించారు. దాసరి శ్రీనివాస్, పిన్నెంటి గంగరాజు, పుప్పాల భీమాంజనేయులు, పిన్నెంటి పూర్ణచంద్రరావు, గణేష్, నాగబాబు, పాము, శివ, కృష్ణ, శ్రీను, వెంకన్నలు ఉన్నారు.

హెచ్ఆర్ఎఫ్ మహిళా కన్వీనర్‌గా లక్ష్మీఉష

మచిలీపట్నంటౌన్: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మచిలీపట్నం శాఖ మహిళా కన్వీనర్‌గా జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర వైద్యవిభాగాధిపతి డాక్టర్ జీ భానుమూర్తి సతీమణి లక్ష్మీ ఉష నియమితులయ్యారు. హెచ్ఆర్ఎఫ్ మచిలీపట్నం శాఖ నగర అధ్యక్ష, కార్యదర్శులుగా వైద్యులు మహేష్, గౌతంలు నియమితులయ్యారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పవిత్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలు, వినియోగ దారుల హక్కులు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి గోవాడ ప్రశాంతి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్ వీరికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పో క్సో చట్టం, హ్యూమన్ ట్రాఫికింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యుల ధ్వజం

- ఇష్టారీతిన వార్డుల్లో శానిటేషన్ వర్కర్ల తొలగింపుపై నిలదీత
- కమిషనర్ బాధ్యతగా పనిచేయడం లేదు
- మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు



మున్సిపల్ సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్) చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: చెప్పిన పనులను మున్సిపల్ అధికారులు చేయడం లేదు.. ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారు.. శానిటేషన్ సిబ్బందిని చెప్పకుండా మార్చేస్తున్నారంటూ సభ్యులు మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు సెలవు పెట్టడం, టీపీవో సుజనకుమారికి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలను అప్పగించినా ఆమె సమావేశానికి హాజరై మధ్యలో వెళ్లిపోవడంపై సభ్యులు మండిపడ్డారు. శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ ఫ్లోర్ లీడర్, 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ 18 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి తన సొంత స్థలంలో కలిపేసి ఇతరులకు విక్రయించిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం ఇవ్వాలని అధికారులను అడిగారు. దీనిపై టీపీవో, ఇన్‌చార్జి కమిషనర్ బి.సుజనాకుమారి మాట్లాడుతూ ఆ స్థలం తిరిగి మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుందని, దీంతో వారిపై చర్యలు తీసుకోలేదని సమాధానం ఇచ్చారు.

సమావేశం అంటే సెలవులు పెడుతున్నారు..

కౌన్సిల్ సమావేశం అంటే సెలవు పెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని కౌన్సిలర్ కటకం ప్రసాద్, 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు అన్నారు. సెలవు పెట్టిన వారు వార్డుల్లో పర్యటించడం ఎందుకని మున్సిపల్ మేనేజర్ ఎం.రాజాను అడిగారు. సమాధానాలు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఇలా గైర్హాజరు కావడం పద్ధతి కాదన్నారు. కమిషనర్ సభ్యులు చెప్పింది వినని పక్షంలో ఆయన కారు అద్దె మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించడానికి మేం ఎందుకు ఆమోదించాలని ప్రశ్నించారు. కారు అద్దె చెల్లింపును సభ్యులు వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

సిబ్బంది మార్పుపై ఆగ్రహం..

వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదంటూ వైఎస్ చైర్మన్ ఎండీ ఖాజా, 18వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, కటకం ప్రసాద్, చంద్రబాబు మండి పడ్డారు. స్థానికులు ఫిర్యాదులు చేస్తే వాటిని మా దృష్టికి తీసుకురాకుండా మీ ఇష్టానుసారంగా సిబ్బందిని మార్చేస్తారా అంటూ నిలదీశారు. కమిషనర్ బాధ్యతగా పనిచేయడం లేదని, సీడీఎంఎకు సరెండర్ చేస్తూ తీర్మానం చేద్దామని సభ్యులు చైర్‌పర్సన్‌కు విన్నవించారు.

రైతులను వంచిస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు

మచిలీపట్నంటౌన్: ఎన్నికల ముందు రైతులకు మాయమాటలు చెప్పిన కూటమి పాలకులు తొమ్మిది నెలల పాలనలో రైతులను ఆదుకోకుండా వంచిస్తోందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు దుయ్యబట్టారు. స్థానిక రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వారు శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి కృష్ణా జిల్లా మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ దక్షిణ మండల అధ్యక్షుడు జన్ను రాఘవరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతాగానికి ఎన్నో హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు నేడు అమలు చేయకపోవటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. బ్రిటీష్ కాలంలోని భూ సర్వేని క్రమబద్ధీకరించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన లాండ్ టైటిలింగ్ యాక్టుపై రైతుల్లో అపనమ్మకాన్ని కలిగిస్తూ ప్రచారం చేశారన్నారు. శాటిలైట్ ద్వారా హద్దులు నిర్ణయించి భూ వివాదాలకు తావులేకుండా జగన్ చేసే ప్రయత్నం చేశారన్నారు. నాడు రైతులు పండించిన 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొని రైతులకు మద్దతు ధర చెల్లిస్తే, నేటి కూటమి ప్రభుత్వం 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండిస్తే దీనిలో కేవలం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసిందని ఆయన విమర్శించారు. ఇది కూడా కనీస మద్దతు ధర లేకపోవటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన్ నాంచారయ్య మాట్లాడుతూ లాండ్ టైటిలింగ్ యాక్టును అసెంబ్లీలో రద్దు చేశామని చెప్పిన కూటమి పెద్దలు అదే యాక్టు ద్వారా ప్రస్తుతం గ్రామాల్లో భూ సర్వే ఎందుకు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ యాక్టు మంచిది కాబట్టే అదే సర్వేను కొనసాగిస్తున్నారన్నారు. ధాన్యం, అపరాలకు గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు గణేషన రమేష్ బాబు, జువ్వా వెంకట నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిప్పళ్ల నాగబాబు, నాయకులు గడిదేసి డేవిడ్‌రాజు, మురారి కోటిలింగేశ్వరరావు, మందా బాబూరావు, గాజుల నాగరాజు, విచారపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వస్తువు కొనేటప్పుడు రశీదు తప్పనిసరి

డీఎస్ఓ పార్వతి



మాట్లాడుతున్న డీఎస్ఓ పార్వతి

మచిలీపట్నం అర్బన్: వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యమని కృష్ణా జిల్లా డీఎస్ఓ పార్వతి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం శనివారం చిలకలపూడి పాండురంగ హైస్కూల్లో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్థిరమైన జీవన శైలికి కేవలం మార్పు అనేది 2025 థీమ్ అన్నారు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వినియోగ దారుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థి దశ నుంచి బలమైన వినియోగదారుడిగా తీర్చిద్దాలన్నారు. జిల్లా రవాణ అధికారి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ..బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఈ–దాఖిల్ (https:// edaakhil. nic. in) వెబ్‌సైట్/యాప్ అందుబాటులో ఉన్నాయన్నారు. నేషనల్ కన్జూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) మొబైల్ యాప్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఇందు కోసం 1915, 1800114000 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమస్య తెలిపితే వారు జిల్లాస్థాయి కమిషన్ దృష్టికి తీసుకెళ్తారని సూచించారు. గుడివాడ అసిస్టెంట్ కంట్రోలర్ టి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..వస్తువు కొనేటపుడు బిల్లు, ఆన్‌లైన్ పేమెంట్ చేసిన తర్వాత ఇన్‌వాయిస్, ఐడీలను భద్రపరుచుకోవాలని సూచించారు. వినియోగదారుల పరిధిలోకి ప్రభుత్వ శాఖలు కూడా వస్తాయన్నారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ శైకం భాస్కరరావు మాట్లాడుతూ.. ఉచిత ఆఫర్ మాయలో పడి కొనుగోలు చేసే ఉత్పత్తుల నాణ్యత పరిమాణం విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.ఎస్ ఈశ్వరరావు, డాక్టర్ అరుణ్, సీపీఎం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాబోయే వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం



కొడాలి(ఘంటసాల): మండల జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ సోదరుడు తుమ్మల వేణుగోపాలరావు కుమార్తె డాక్టర్ నిషిత, డాక్టర్ గగన్ నిశ్చితార్థ వేడుకలు మండలంలోని కొడాలి గ్రామంలో శనివారం నిర్వహించారు. నిషిత, గగన్‌లను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, యువనేత సింహాద్రి వికాస్ స్థానిక నేతలతో కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం

కృత్తివెన్ను: మండలంలోని మునిపెడ, నీలిపూడి, యండపల్లి గ్రామాలలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి యండపల్లి స్లోపు వద్ద ప్రధాన పంటకాలువపై రూ.75 లక్షలతో, నీలిపూడి డ్రెయిన్‌పై రూ.19.80 లక్షలతో నిర్మించిన వంతెనలతో పాటు నీలిపూడి, మునిపెడ గ్రామాలలో రూ.15 లక్షలతో తాగునీటి అవసరాల కోసం నిర్మించిన మైక్రోవాటర్ ఫిల్టర్ల స్కీంలను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. నీలిపూడిలో సీసీ రోడ్లును ప్రారంభించారు. యండపల్లి, మునిపెడ, నీలిపూడి సర్పంచ్‌లు ప్రభుప్రసాద్, కృష్ణ, శ్రీదేవి, ఇరిగేషన్ ఈఈ కొడాలి బాబూ వివిధ పార్టీల నాయకులుపాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మి జయంతి

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో జగద్గురు శ్రీ రామానుజాచార్య సంస్థాన్‌లో శనివారం ఉదయం శ్రీ లక్ష్మి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 127 గరుడ వాహనాలపై దివ్య భవ్య గరుడ సేవ నిర్వహించారు. 127 గరుడ వాహనాలపై శ్రీమన్నారాయణ స్వామి వారు పురవీధుల్లో విహరించగా భక్తులు పెద్ద ఎత్తున దర్శించారు. నగర వాసులు దర్శించేందుకు మక్కువ చూపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీ త్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామి, శ్రీ త్రిదండి బృందావన జీయర్‌స్వామి, శ్రీ త్రిదండి శఠగోపముని జీయర్ స్వామి హాజరయ్యారు. శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీనివాస శ్రీకర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారిశుద్ధ్య పనులు



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ రాంజీ, సిబ్బంది

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ కె.రాంజీ, రిజిస్ట్రార్ ఎన్.ఉష, రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, సిబ్బంది పిచ్చిమొక్కలను తొలగించారు. ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఎన్‌సీసీ అధికారులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సబ్‌జైలులో..

మచిలీపట్నం నగరంలోని సబ్‌జైలులో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జైలు పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి పారిశుద్ధ్య పనులు చేశారు. శిక్ష అనుభవిస్తున్న ముద్దాయిలతో ప్రతిజ్ఞ చేయించారు. జైలు సూపరింటెండెంట్ పిల్లా రమేష్, డెప్యూటీ జైలర్ బొత్స అప్పారావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పెడన: పట్టణంలో పలు చోట్ల స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ రైతు బజారు, వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు పలు వార్డుల్లో అవగాహన కల్పించారు. శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు. మండలంలో పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో– 2 వైవీ హరనాథ్ పరిసరాల పరిశుభ్రతపై దిశానిర్దేశం చేశారు. జింజేరు, నందమూరు తదితర పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారిణి, డీఎస్ఓ వి.పార్వతి కోరారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఆకులమన్నాడు పంచాయతీ పరిధిలోని చెరువు గట్టుపై డీఎస్ఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బి.రాజేశ్వరి, సర్పంచి ఎండీ.రఫీ, ఉపసర్పంచి బాకి నాని, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక పంచాయతీ ఆవరణలో శనివారం గ్రామసభ జరిగింది. సభలో ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై అవగాహన కల్పించారు. మహిళలకు డస్ట్‌బిన్‌లు, చేతి సంచులు పంపిణీ చేశారు. ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు దుకాణాల వెంట తిరిగి ప్లాస్టిక్ నిషధంపై ప్రచారం చేశారు. ప్రధాన కూడలిలో మానవహారం నిర్మించారు. గ్రామ సర్పంచ్ కైతేపల్లి అంకాలు అధ్యక్షతన జరిగిన సభలో తహసీల్దార్ ఎం.హరనాథ్, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, స్థానిక గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, వెలుగు ఏపీఎం కేవైదాసు, సామాజిక కార్యకర్త కన్నా రాజు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘంటసాల: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని కృష్ణాజిల్లా పర్యాటకశాఖ అధికారి రామలక్ష్మణ అన్నారు. స్థానిక బౌద్ధ స్తూపం, బౌద్ధ మ్యూజియం వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూజియం, స్తూపం పరిసర ప్రాంతాలను సిబ్బంది, కార్మికులు చెత్తను తొలగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టి.జయలక్ష్మి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీవో డి.సుబ్బారావు, మల్లంపల్లి, ఘంటసాలపాలెం, కొడాలి, చిట్టూర్పు, లంకపల్లి, తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ నయామ్, అర్జునరావు, నాగమణి, శ్రీలక్ష్మి, నాంచారమ్మ, ఈవోల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మచిలీపట్నంటౌన్: నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోనేరుసెటర్‌లో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కోనేరు సెంటర్ పరిసరాలను కమిషనర్ బాపిరాజు, సిబ్బంది శుభ్రపర్చారు. వ్యర్థాలను సేకరించి గుంటూరు జిల్లా కొండవీడులోని జిందాల్ పవర్‌ప్లాంట్‌కు పంపారు. తొలుత నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మున్సిపల్ ఆరోగ్య విభాగం, మెప్మా సీఆర్‌పీలు, సిబ్బంది కోనేరుసెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ జీ గోపీచంద్ హాజరై సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మెప్మా సీఎంఎం ఆనంద్‌బాబు, శానటరీ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులు ప్రతిజ్ఞ చేసి పరిసరాలను శుభ్రం చేశారు.

మోపిదేవి: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్రపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక స్వామివారి దేవస్థానంలో కార్యాలయ అధికారులు, సిబ్బందిచే తొలుత ప్రమాణం చేయించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. పీహెచ్‌సీ డాక్టర శ్రీరామ్ సాయి తదితరులు ర్యాలీ నిర్వహించారు.

రేపటి 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



విద్యార్థినికి కిట్ అందజేస్తున్న నిర్వాహకులు

కృత్తివెన్ను: ఈ నెల 17వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాదరావు శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 439 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. సంగమూడి, లక్ష్మీపురం, పోడు ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని చోట్ల సీసీ కెమేరాలు, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

బంటుమిల్లిలో..

మండలంలో పదవతరగతి పరీక్షలకు మొత్తం 780 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. బంటుమిల్లిలోని సెయింట్స్‌జాన్స్, కొమ్మారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అర్తమూరు, పెదతుమ్మిడి, చోరంపూడి పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్, తాగునీటితో పాటు, సీసీ కెమెరాలు అన్ని వసతులు ఉన్నాయన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రియల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (ఆర్ఎఫ్ఎ) ఆధ్వర్యంలో శనివారం స్థానిక గిలకలదిండిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లో నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర అవసరమైన స్టేషనరీ వస్తువులు ఉన్నాయి. పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, వాటపల్లి రమేష్, స్కూల్ చైర్మన్ కర్రి కుమార్, ఆర్ఎఫ్ఎ టీమ్ సభ్యులు గాడి జోసఫ్ కిషోర్, విజయ్ బాబు, ఒడుగు సాంబమూర్తి, ఎ.శేషు బాబు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



ఉప్పాల రాముతో పార్టీ నాయకులు

గూడూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని పార్టీ పెడన ఇన్‌ఛార్జి ఉప్పాల రాము కోరారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిపర్తి రవికుమార్, కార్యదర్శులు లంకా సుబ్రహ్మణ్యం, పిండి వెంకన్నబాబులు శనివారం కూడూరులోని స్వగృహంలో ఉప్పాల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవులు కేటాయింపునకు చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాము మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ముక్కొల్లు ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆకులమన్నాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ జంపాన ఫకీరు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కౌలు చట్టాన్ని ఆమోదించాలి

ఘంటసాలపాలెం(ఘంటసాల): ప్రస్తుతం జరుగుతున్న శాసన సభ సమావేశాల్లో నూతన కౌలు చట్టాన్ని ఆమోదించి కౌలు రైతులకు మేలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం సీనియర్ నేత వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణ కోసం నూతన కౌలు ముసాయిదా చట్టాన్ని ప్రస్తుత శాసన సభ సమావేశాల్లో ఆమోదించాలని కోరుతూ కౌలు రైతులతో కలిసి సంఘం నేతలు మండలంలోని ఘంటసాలపాలెం గ్రామ సచివాలయంలో కార్యదర్శి బి.అర్జునరావుకు శనివారం వినతిపత్రం అందించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ, కూటమి నేతలు సీసీఆర్సీ చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి ప్రాంతీయ సమావేశాలు జరిపి కౌలు రైతుల చట్టం ముసాయిదా తయారు చేశారన్నారు. దీనిని ఆమోదించాలని కోరారు. ఎం.వెంకటేశ్వరరావు, శివ, కౌలు రైతులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మచిలీపట్నంటౌన్: గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందే క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి టీబీ విభాగ ఉద్యోగులు పేర్కొన్నారు. స్థానిక ఈడేపల్లిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం క్షయవ్యాధి అవగాహన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు రావడం, జ్వరం, దగ్గినపుడు కళ్లెలో రక్తపు చారలు కన్పించటం, ఆకలి మందగించటం, బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి సోకినట్లుగా గుర్తించాలన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కళ్లె పరీక్షను ఉచితంగా చేస్తారన్నారు. చికిత్స కాలంలో పౌష్టికాహారం, నెలకు రూ. వెయ్యి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. వైద్యురాలు కే నాగలక్ష్మి, డీపీఎస్ జీ ధనలక్ష్మి, పీపీఎం మధు, ఎస్‌టీఎస్ ఎ.విజయగౌరి, టీబీహెచ్‌వి కేవీవీ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తకు నివాళి

చల్లపల్లి: మంగళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త కొమ్ముకూరి రాఘవులు (95) భౌతికకాయం వద్ద వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్ నివాళులర్పించారు. వయస్సు రీత్యా అనారోగ్యానికి గురైరాఘవులు మృతి చెందారు. రాఘవులు కుటుంబ సభ్యులకు వికాస్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముగిసిన అమ్మవారి జాతర

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు శనివారం అమ్మవారి పవళింపు సేవతో ముగిసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు తెలిపారు. గత 15 రోజుల పాటు ఇంటింటా అమ్మవారి దర్శనంతో భక్తుల విశేషపూజలు అందుకున్న నాంచారమ్మ తల్లి ఆలయ ప్రవేశం, పవళింపు సేవతో ముగిసినట్లు వివరించారు. ఉత్సవాలు జయప్రదం చేసిన అధికారులు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బుసక తవ్వేస్తూ.. తరలిస్తూ..



తహసీల్దారు కార్యాలయంలో సమీపంలో బుసక గుట్టలు

పెడన: మండలంలో బుసకకు మంచి డిమాండ్ ఉండటంతో ఇష్టానుసారంగా తవ్వేస్తూ తరలించేస్తున్నారు. ఎవరికి పడితే వారికి ఈ విధంగా బుసక ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. కొన్ని చోట్ల స్థానికంగానే డంప్ చేస్తున్నారు. ఇటువంటి బుసకాసూరులు పుర ప్రజలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం కనిపిస్తూనే ఉంటున్నారు. రాత్రి సమయంలో అయితే వీరు ఆగడాలకు అంతే ఉండదు. కానీ వీరు ఇటు రెవెన్యూ వారికి, అటు పోలీస్ వారికి కూడా కనిపించడం లేదంటే విడ్డూరంగా ఉంది. తహసీల్దారు కార్యాలయానికి కూత వేటు దూరంలో బైపాస్ రోడ్డును అనుకుని బుసకను డంప్ చేస్తూ తరలిస్తున్నా ఎవరికి కనిపించడం లేదంటే..దాని వెనుక పరిస్థితులు అర్థమవుతున్నాయని అంటున్నారు. అధికారులు బుసకాసురుల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దస్తావేజులు పోయినవి

జల్లు కళ్యాణరామ S/o. రామారావు డోర్ నెం: 15/156, మాచవరం, మచిలీపట్నం, కృష్ణాజిల్లా అను నాకు చెందిన ఒరిజినల్ దస్తావేజులు నెం : 2399/1938, 2885/1987 మచిలీపట్నం హౌసింగ్ బోర్డు, పెట్రోల్ బంకు దగ్గర జిరాక్స్ తీయించుకునే నిమిత్తం వెళుతుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికిన వారు కింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.

సంప్రదించండి : 7660096669

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ జి.గోవిందరావు శనివారం తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు చిన్నాపురం ఫీడర్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న దృష్ట్యా చిన్నాపురం, పెదయాదర, చినయాదర, ఎన్.గొల్లపాలెం, వాడగొయ్యి తదితర గ్రామాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

26న హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఈనెల 26న ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే ఈ హుండీ లెక్కింపులో పాల్గొనదలచిన భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొన వచ్చని డీసీ తెలిపారు. ఆలయంలో కానుకల హుండీ లెక్కింపు కారణంగా ఆరోజున స్వామివారి శాంతి కల్యాణం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని భక్తులు గమనించాలని ఆయన కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com